క్లుప్తంగా

నేడు వంతులవారీగా సాగునీరు

అంబాజీపేట: ముక్కామల లాకులపై ఉన్న తొమ్మిది గ్రామాల శివారు భూములకు బుధవారం ఉదయం 6 గంటల నుంచి ఈ నెల 21వ తేదీ ఉదయం 6 గంటల వరకు 48 గంటల పాటు వంతుల వారీ విధానంలో సాగునీరు అందిచనున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. మోడేకుర్రు, నేదునూరు, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, కె.పెదపూడి, గంగలకుర్రు, మొసలపల్లి, సావరం గ్రామాల్లోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా రావులమ్మ తీర్థం


రావులమ్మ తల్లి

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం వైభవంగా జరిపారు. అమ్మవారికి గ్రామ ఆడపడుచులు చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలతో పాటు కోయ డ్యాన్సులు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం అమ్మవారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మండల పాస్టర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

పి.గన్నవరం: మండల పాస్టర్స్ అధ్యక్షుడిగా రెవరెండ్ పి.ప్రశాంతకుమార్ ఎన్నికయ్యారు. పోతవరం గ్రామంలోని పాస్టర్ చిరంజీవి ప్రార్థనా మందిరంలో మంగళవారం నూతన కార్యవర్గం ఎన్నికైంది. మండల ఉపాధ్యక్షుడిగా జె.ఇమ్మానుయేలు, కార్యదర్శిగా సీహెచ్ సువర్ణరాజు, కోశాధికారిగా డి.ఏసురత్నం, సంయుక్త కార్యదర్శిగా కేఆర్ఆర్ సింగ్ ఎన్నియ్యారు. ది గాడ్స్ వే ఆర్గనైజేషన్ స్టేట్ కోఆర్డినేటర్ రెవరెండ్ జాన్‌పాల్, కేపీడబ్ల్యు రీజినల్ చైర్మన్ కె.రాజారత్నం, సీనియర్ పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సేవా సంస్థ అధ్యక్షుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న క్రాంతి కుమారి

మలికిపురం: ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థికసాయం చేసి ఆదుకుంటున్న గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కట్టా భాస్కర్ మరో అవార్డు అందుకున్నారు. మయూరి ఆర్ట్స్ ప్రెజెంట్ సంస్థ అందించిన ఇండియన్ నేషనల్ ఐకాన్ 2024 అవార్డు మరియు ప్లాటినం బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ దక్కించుకున్నారు. భాస్కర్ విదేశాల్లో ఉండటం వలన భాస్కర్ భార్య క్రాంతికుమారి ఈ అవార్డు హైదరాబాద్ రవీంద్రభారతిలో బుధవారం జరిగిన సదస్సులో స్వీకరించారు. గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ చేస్తున్న సేవా కార్యకార్యక్రమాలను గుర్తించి పలు సంస్థలు ఇలా అవార్డు అందజేయడం ఆనందంగా ఉందని సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

కేరళ పీజీలో కొత్తపేట విద్యార్థులకు సీట్లు


గనిశెట్టి రామకృష్ణ మోహన్‌శంకర్


కొల్లాటి జాయసి

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు సైన్స్ విద్యార్థులు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ కామన్ ఎంట్రెన్స్ పీజీ (ఎంఎస్సీ కెమిస్ట్రీ) లో సీట్లు సాధించినట్టు ప్రిన్సిపాల్ కేపీ రాజు మంగళవారం తెలిపారు. తమ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన గనిశెట్టి రామకృష్ణ మోహన్ శంకర్ ఆరో ర్యాంకు, కొల్లాటి జాయసి ఏడో ర్యాంకు సాధించినట్టు తెలిపారు. వీరికి కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు జి.శ్రీనివాసులు, పి.సాయి కృష్ణ, ఇతర అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రతాప్‌కు బిరుదు ప్రదానం


ఇంద్రకుమార్ రాజు చేతుల మీదుగా సాహితీ సార్వభౌమ బిరుదు అందుకుంటున్న ప్రతాప్

సఖినేటిపల్లి: తిరుపతి వేంకటేశ్వర యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో సోమవారం రాత్రి నిర్వహించిన సాహిత్య సదస్సులో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, సాహితీ సార్వభౌమ బిరుదును అందుకున్నారు. తిరుపతికి చెందిన సాహిత్య సంస్థ ఉషోదయ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ధనశి ఉషారాణి, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఇంద్రకుమార్‌రాజు సంయుక్త ఆధ్వర్యంలో ఈ బిరుదును మండలానికి చెందిన ప్రతాప్‌కు ఇచ్చారు. అలాగే స్వర్ణ కంకణంతో సత్కరించారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లో నిత్య కృషీవలుడు ప్రతాప్ అని వక్తలు ప్రశంసించారు. ఈ రంగంలో నాన్ స్టాప్ కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నందుకు పై అవార్డు ఇచ్చినట్టు ప్రతాప్ మంగళవారం చెప్పారు. పలువురు సాహిత్య సేవా ప్రముఖులు పాల్గొన్నారు.

తాటిముంజె.. భలే పసందు

- పుష్కలంగా విటమిన్లు
- పల్లెటూళ్లలో కానరాని తాటిముంజె
- ముగుస్తున్న సీజన్



కోసిన తాటిముంజె కాయలు (అంతర చిత్రం) తినేందుకు సిద్ధంగా ఉన్న తాటిముంజెలు

ఆలమూరు: వేసవితాపాన్ని అధిగమించేందుకు, శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించి ఆరోగ్య ప్రయోజనాలను అందించేందుకు ప్రకృతి ప్రసాదించిన తాటిముంజెలు (ఐస్ యాపిల్) సీజన్ ముగింపు దశకు చేరుకుంది. తాటికాయలు ముంజెల దశలో జెల్లీలా పట్టుకుంటే జారిపోయే అంత మృదువుగా ఉంటాయి. నోట్లో వేసుకుంటే కరిగిపోయే స్వచ్ఛమైన తియ్యదనంతో ఉండే ఈతాటి ముంజెలకు వేసవిలో ప్రత్యేకత ఉంది. మరో రెండు నెలల్లో తాటిముంజెలు తాటిపళ్లగా మారి తాటి పదార్థాలను అందించడంతో పాటు ఆరోగ్యకరమైన తేగలను ఇస్తుంది. ఈ తాటిముంజెలు శరీరంలోని చక్కెర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేసే అవకాశం ఉన్నందున సీజన్‌లో ఈ తాటిముంజెలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ లభ్యత ఉన్నా తాటిచెట్లు ఎక్కి ముంజెకాయలు దింపే కార్మికులు లేకపోవడంతో ఈ తాటిముంజెల లభ్యత నానాటికి తగ్గిపోతుంది. ప్రకృతి నుంచి లభ్యమయ్యే ఈ తాటిముంజెలు కల్తీ లేని స్వచ్ఛమైనవి కావడంతో అందరూ తినేందుకు ఇష్టపడుతున్నా తాటిచెట్లు పుష్కలంగా ఉన్నా సేకరించే వారు లేకపోవడంతో సరైన రీతిలో అందుబాటులో ఉండటం లేదు. ఇదే క్రమంలో కొంతమంది మెట్ట, చాగల్నాడు ప్రాంతాలకు చెందిన రైతు కూలీలు తాటిముంజెలను ప్రధాన వ్యాపార కేంద్రంగా చేసుకుని సమీప పట్టణాల్లో విక్రయిస్తున్నారు. దీంతో పట్టణ ప్రజలే కాదు, పల్లెటూళ్లకు చెందిన ప్రజానీకం కూడా ఈ తాటిముంజెలను కొనుగోలు చేసి మరీ తింటున్నారు. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాలోని ప్రధాన రహదారుల్లోని వివిధ ప్రాంతాల్లో తాటిముంజెల దుకాణాలు వెలుస్తున్నాయి. తాటిముంజుల సైజును బట్టి డజను తాటిముంజెలు రూ.60 నుంచి రూ.100 వరకూ విక్రయిస్తున్నారు. ప్రస్తుతం సీజన్ ముగిసిపోతుండటంతో తాటిముంజెలు ముదిరిపోయినా జిహ్వ ప్రియులు మాత్రం తినేందుకు కొనుగోలు చేయకుండా ఉండలేకపోతున్నారు.

తాటిముంజెల వల్ల కలిగే ప్రయోజనాలు

- తాటిముంజెల్లో విటమిన్లు, పాస్ఫరస్, థయమిన్, బీ–కాంప్లెక్స్, కాల్షియం, పఋటాషియంతో పాటు సోల్యుబుల్ ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.
- తాటిముంజెల్లో నీటిశాతం ఎక్కువగా ఉండటం వల్ల డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది, వేసవితాపం, వడదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది.
- తాటిముంజెలను తినడం వల్ల శరీరంలో పేరుకుపోయిన హానికర వ్యర్థ పదార్థాలను బయటకు పంపించడంతో పాటు రక్తపోటును అదుపులో ఉంచుతుంది.
- వేసవిలో ఏటా క్రమం తప్పకుండా తాటిముంజెలను తినడం ద్వారా చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించుకుని మంచి కొలెస్ట్రాల్‌ను వృద్ధి చేసుకోవచ్చు. లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.
- తాటిముంజెల్లో తక్కువ మొత్తంలో క్యాలరీలు, ఎక్కువ మొత్తంలో పోషకాలు ఉండటం వల్ల అలసట, నిర్జలీకరణం నుంచి ఉపశమనం కలిగించి బరువును పెంచకుండా దోహదపడుతుంది.
- తాటి ముంజెల్లో ఉండే పోషకాలు జీర్ణ సంబంధిత సమస్యను తగ్గిస్తాయి. వాటిని తినడం వలన తీసుకున్న ఆహారం సక్రమంగా జీర్ణమై గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరంగా ఉండే ఉదర సంబంధిత సమస్యలు చాలా వరకు తగ్గిపోతాయి.
- వేసవి తీవ్రత కారణంగా వచ్చే వికారం, వాంతులను నివారిస్తుంది. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను బాగా తగ్గిస్తుంది. వేసవిలో వచ్చే చికెన్‌పాక్స్‌ని నివారించి, శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.
- తాటి ముంజెల్ని గుజ్జుగా చేసి ముఖానికి పైపూతలా వేసుకుంటే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ఇది చర్మానికి కావల్సినంత తేమను అందించి వేసవి కాలంలో వచ్చే చెమటకాయల్ని నివారిస్తుంది. అలాగే ఎండ వేడిమి వల్ల ముఖంపై ఏర్పడే మచ్చలను తగ్గిస్తుంది.

ఆరోగ్య రక్షణకు దోహదపడుతుంది



వేసవి నుంచి వర్షాకాలం ప్రారంభం వరకూ లభ్యమయ్యే తాటిముంజెలను తినడం వల్ల సంపూర్ణమైన ఆరోగ్య రక్షణ లభిస్తుంది. పోషకాలు అధికంగా ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుంది. సీజన్ సమయంలో ప్రతి ఒక్కరూ తినవలసిన అవసరం ఉంది.

– సీహెచ్ మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీ, కలవచర్ల

తాటిముంజెలతో సంపూర్ణ ఆరోగ్యం



తాటిముంజెలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. ఐస్ యాపిల్‌గా పిలుచుకునే తాటిముంజెలను ఏడాదికి ఒకసారైనా తినాలని కోరిక ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యం కాకపోయినా ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేసుకుని మరీ తింటున్నాం.

– చిన్నం భవాని, గృహిణి, ఆలమూరు

జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన శిరీష్


తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన శిరీష్

అయినవిల్లి: రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్ నారాయణస్వామి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శిరీష్ నారాయణస్వామిని పి.గన్నవరం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. అధికారంలో కూటమి నాయకులు చేసే దాడులను పార్టీ మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారని శిరీష్ తెలిపారు.

మామిడికుదురులో షాపులు బంద్

మామిడికుదురు: నగరం రూరల్ బ్యాంకు మాజీ చైర్మన్, దాత నయనాల వెంకటస్వామినాయుడు మృతికి సంతాప సూచకంగా మంగళవారం మామిడికుదురులో స్వచ్ఛందంగా షాపులు మూసి వేసి బంద్ పాటించారు. కాగా అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందిన వెంకటస్వామినాయుడు మృతదేహంపై మాజీ ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, పాముల రాజేశ్వరీదేవి మంగళవారం పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఆయన మృతి తీరని లోటని, రూరల్ బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నో సేవలందించారని కొనియాడారు. గ్రామ సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, నగరం పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య, తదితరులు వెంకటస్వామినాయుడు మృతికి సంతాపం తెలిపారు.

అంగన్‌వాడీల్లో ఆట పాటలతో విద్య


పాశర్లపూడిలో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న సీడీపీఓ విజయశ్రీ


ఆలమూరులో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ శారద

మామిడికుదురు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని, కార్పొరేట్ స్కూల్స్ తరహాలో ఇక్కడ బలవంతపు విద్య ఉండదని పి.గన్నవరం ఐసీడీఎస్ సీడీపీఓ వై.విజయశ్రీ పేర్కొన్నారు. పాశర్లపూడిబాడవ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం మండల స్థాయి గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్పొరేట్ స్కూళ్లలో నాలుగు గోడల మధ్య బంధించి విద్య నేర్పిస్తారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆ విధంగా కాకుండా చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తామన్నారు. ఏడో నెల నుంచి అయిదేళ్ల నిండే వరకు పిల్లలను వారి శారీరక, మానసిక, భాషాభివృద్ధి నేర్పుతూ స్కూల్‌కి సంసిద్ధం అయ్యే విధంగా తీర్చిదిద్దే మొదటి గురువుగా పేరెంట్స్‌కు నమ్మకం కలిగించాలన్నారు. ఆ విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పిల్లలను సాకుతున్న తీరును పలువురు తల్లులు సమావేశంలో వివరించారు. హెచ్ఎం సీహెచ్ సుజాత, టి.వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎస్.సుబ్బలక్ష్మి, బి.అన్నపూర్ణ, పి.విజయలత, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: అంగన్‌వాడీలో చదువు నేర్చుకుంటున్న చిన్నారులను అత్యున్నత స్థాయికి చేర్చడమే లక్ష్యంగా ఐసీడీఎస్ శాఖ పనిచేస్తుందని కొత్తపేట సీడీపీఓ పి.శారద అన్నారు. మండలంలోని ఆలమూరు, మడికి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన గ్రాడ్యుయేషన్ మాదిరిగానే భవిష్యత్‌లో దేశంలో ప్రసిద్ధి చెందిన యూనివర్సిటీల్లో గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్‌ను తీసుకునేందుకు ఇప్పటి నుంచి చిన్నారులకు పునాదులు వేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఐసీడీఎస్ ద్వారా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అలాగే నాణ్యమైన పౌష్టికాహారాన్ని నేరుగానే ఇంటికి పంపిణీ చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల అంగన్‌వాడీ సమాఖ్య ఆధ్వర్యంలో యూనిఫాం ధరించిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ ఘనంగా నిర్వహించి పట్టాను అందజేశారు. అనంతరం గర్భిణులు బాలింతలకు పోషకాహార కిట్లను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలల్లోకి వెళ్లే విద్యార్థులకు అత్యుత్తమ విద్యను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి, మహిళ సంరక్షణ కార్యదర్శులు పి.సత్య, డి.రత్న, అంగన్‌వాడీలు సీహెచ్ సరోజారాణి, దండంగి శ్యామల, వి ఆనందకుమారి, ఎం.రామలక్ష్మి, జి.సూర్యకుమారి, జి.లక్ష్మీకుమారి, వి.వరలక్ష్మి, దొంగ మణి పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్‌కు పంపాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి కోరారు. మంగళవారం సఖినేటిపల్లిలంక అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్ వాడీ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ, ప్రీ స్కూల్స్‌లో మంచి వాతావరణంలో పిల్లలకు సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయభారతి, సర్పంచ్ రేపూరి రాజేశ్వరి, ఉపసర్పంచ్ కామన దొరబాబు, రేపూరి ఏసు నరసింహరాజా, టీచర్లు కె.ఆశాజ్యోతి, రుద్రరాజు భవాని, జి.సునీత, వాస్కూరి లీల పాల్గొన్నారు.

పాఠశాలలకు ఆడిట్


ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆడిట్ నిర్వహించిన ఆడిటర్లు

ఆలమూరు: గ్రామ శివారు కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాలల ఆడిట్ అధికారులు ఆడిట్‌ను నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలోని జిల్లాలోని వివిధ పాఠశాలల ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఆడిట్‌ను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపట్టారు. హైదరాబాద్‌లోని జీసీ రెడ్డి అండ్ అసోసియేట్స్ నుంచి వచ్చిన ఆడిటర్లు బి.పవన్‌కల్యాణ్, ఎస్‌టైటస్, బి.శివరమేష్‌లు పాఠశాలల ఆడిట్ నిర్వహించారు. ఆలమూరు, కె.గంగవరం, రామచంద్రపురం, కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట, రావులపాలెం, కొత్తపేట మండలాలకు చెందిన 215 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఆయా మండలాల విద్యాశాఖ కార్యాలయాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఈ ఆడిట్ జరిగినట్లు మండల విద్యాశాఖాధికారులు పి.షాలెంరాజు, పీవీ సుబ్బరాజు తెలిపారు. జిల్లా సమగ్ర శిక్షా ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, ఏఎంవో పి.రాంబాబు తదితరులు ఈ ఆడిట్ నిర్వహణను పర్యవేక్షించారు. ఎఫ్ఏవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బుధవారం అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో అమలాపురం, అయినవిల్లి, అల్లవరం, అంబాజీపేట, ఐ.పోలవరం, కాట్రేనికోన, మలికిపురం, మామిడికుదురు, ముమ్మిడివరం, పి.గన్నవరం రాజోలు, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం మండలాలకు చెందిన 385 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఆయా మండలాల ఎంఆర్‌సీ కార్యాలయాల ఆడిట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు భమిడిపాటి అప్పాజీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వంతెనను ఢీకొన్న గూడ్స్ ఆటో


శానపల్లిలంకలో వంతెన కింద లోడు ఆటో ముందర భాగం ఇరుక్కుపోయి నుజ్జయిన దృశ్యం

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంకలో బొబ్బర్లంక–పల్లంకుర్రు పంటకాలువపై ఏర్పాటు చేసిన వంతెనను మంగళవారం గూడ్స్ ఆటో ఢీకొని ముందు భాగం నుజ్జయింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం శానపల్లిలంక వద్ద బొబ్బర్లంక–పల్లంకుర్రు పంటకాలువపై ఏర్పాటు చేసిన వంతెనను ముక్తేశ్వరం నుంచి ఎస్.మూలపాలెం సిమ్మెంట్ బస్తాలతో వెళ్తున్న లోడు ఆటో ఢీకొంది. ఆటో డ్రైవర్ చిన్నపాటి గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే ఈ వంతెన నుంచి మోటార్ సైకిల్స్, సైకిల్స్, ఓ మోస్తరు వాహనాలు వెళ్లేందుకే సరిపోతుంది. ఈ వంతెన నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్, పంచాయతీ రాజ్ అధికారులకు అవగాహన ఏ మాత్రం లేక పోవడంతో వంతెన కింద నుంచి రహదారి ఏర్పాటు చేయడం, వంతెన నిర్మాణం కూడా ఏ మాత్రం అవగాహన లేకుండా నిర్మించడం వల్ల తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ వంతెన కింద నుంచి దారిని పూర్తిగా మూసి ఆ పక్కనే వంతెన చుట్టూ ఏర్పాటు చేసిన రోడ్డున వెళ్లేలా చర్యలు తీసుకోవాలని లేక వంతెనను పూర్తి కూల్చి వేసి కొత్త వంతెనను నిర్మించాలని కోరుతున్నారు. అప్పుడే ఇటువంటి ప్రమాదాలు జరగకుండా కాపాడవచ్చని చెబుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పెరటి మొక్కల తోడ్పాటు


సఖినేటిపల్లిలంకలో విద్యార్థులతో మొక్కలు నాటే క్రమంలో ప్రభావతి, నరసింహారావు

సఖినేటిపల్లి: పెరటి మొక్కలను పెంచుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు ఎంతో తోడ్పాటు ఇస్తాయని ఏపీ ఎన్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి అన్నారు. మంగళవారం సఖినేటిపల్లిలంకలో విద్యార్థులకు, గ్రామస్తులకు సుస్థిర ఆహార వ్యవస్థ అను అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ ఎన్జీసీ, ఏపీ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరుగుచున్న ఏడు రోజుల షెడ్యూల్‌లో భాగంగా ఐదో రోజు పై కార్యక్రమం ఆమె చేపట్టారు. ఇందులో భాగంగా ఏవో పీవీ నరసింహారావు సహకారంతో పాఠశాల ఆవరణలో గోంగూర, మునగ, అరటి, జామ, మిరప, పుదీనా, వాము మొక్కలను విద్యార్థులతో కలిసి ఆమె నాటారు. ఈ మేరకు ఏ విధమైన ఎరువులు వాడకుండా మన పెరట్లోనే ఆరోగ్యకరమైన కూరగాయలు ఏ విధంగా పండించుకోవాలో వారికి ప్రభావతి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె ర్యాలీ నిర్వహించారు.

పోలీస్ అధికారులకు సత్కారం


రాజోలు సీఐ గోవిందరాజును సత్కరిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

రాజోలు: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించిన పోలీస్ అధికారులకు విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం సత్కరించారు. విద్యార్థి సంఘ నాయకుడు పోలిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్సై పృథ్వీరాజ్‌ను దుశ్శాలువాలతో సత్కరించారు. సామాజిక సేవపై విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు ఎన్ఎస్ఎస్ ద్వారా ఎన్నికల్లో విద్యార్థులను పోలీస్ వలంటీర్లుగా సేవలు వినియోగించుకుని వారికి ప్రశంసాపత్రాలు అందజేయడం అభినందనీయమన్నారు. దీంతో విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, పోలీస్‌శాఖలో ఉద్యోగం సాధించేలానే సంకల్పం కలుగుతుందన్నారు. విద్యార్థి సంఘ నాయకులు చొప్పల రామకృష్ణ, పొన్నమండ సత్య, తాడి శ్రీకాంత్, అడపా అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు


లక్ష్మీనృసింహుని సన్నిధిలో అర్చకులు నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణం విశేష పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో మంగళవారం స్వామి సన్నిధిలో వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాలు అర్చకులు ఘనంగా ప్రారంభించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ నెల 22వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు వీటిని నిర్వహించనున్నారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు పెద్దింటి వేంకట శ్రీనివాస్, ఎస్‌బీఎం రమేష్, జీఎల్ఎన్ రాజేష్‌లు విష్వక్సేన పూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణ, గ్రామోత్సవం వంటి విశేష కార్యక్రమాలు చేశారు. అటుపై వేంకటేశ్వరస్వామివారి కల్యాణం కనుల పండువగా అర్చకులు నిర్వహించారు. భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న ధర్మోజీరావు స్మారక అవార్డులు


నగరంలో కరపత్రాలు విడుదల చేస్తున్న దళిత చైతన్య వేదిక ప్రతినిధులు

మామిడికుదురు: పద్యకవి, రచయిత దివంగత గుర్రం ధర్మోజీరావు సంస్మరణ సభ ఈ నెల 20న రాజోలు మండలం తాటిపాకలో జరుగుతుందని దళిత చైతన్య వేదిక నాయకులు తెలిపారు. నగరం జై భారత్‌నగర్‌లో సంస్మరణ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. 20వ తేదీన తాటిపాకలో రాజోలు తాలూకా బిల్డింగ్ కన స్ట్రక్షన్స్ భవనంలో మధ్యాహ్నం 2 గంటలకు సంస్మరణ సభ జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 15 మంది ప్రముఖులకు ధర్మోజీరావు స్మారక పురస్కారాలు అందిస్తామన్నారు. సమావేశంలో దళిత చైతన్య వేదిక నాయకులు బత్తుల జనార్దనరావు, బత్తుల మురళీకృష్ణ, దీపాటి శివప్రసాద్, చిలకపాటి శ్రీధర్, మందపాటి మధు, గోగి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

పి.గన్నవరం: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్త, అత్త, ఆడపడుచుపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నాగుల్లంక శివారు పెదకందాలపాలేనికి చెందిన దాకే నాగేంద్ర ప్రసాద్‌తో పి.గన్నవరం శివారు అంబటివారిపాలేనికి చెందిన వెంకటలలితతో 2022 మార్చిలో వివాహం జరిగింది. అప్పట్లో రూ.2 లక్షల నగదు కట్నంగాను, సారె సామాన్లు ఇచ్చారు. వీరికి పాప ఉంది. అయితే వివాహం జరిగిన నెల రోజుల అనంతరం అదనపు కట్నం కోసం భర్త నాగేంద్ర ప్రసాద్ వేధిస్తున్నాడని, అతనికి అత్త, ఆడపడుచు సహకరిస్తున్నారని భార్య వెంకట లలిత గతంలో పెద్దలను ఆశ్రయించింది. అయినప్పటికీ అత్తింటి వారి వేధింపులు ఆగకపోవడంతో మంగళవారం తమకు ఫిర్యాదు చేసినట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బడి మానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ చేర్పిద్దాం


'నేను బడికిపోతా' ర్యాలీలో పాల్గొన్న ఏపీసీ మధుసూదనరావు, అధికారులు తదితరులు


టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద క్యాంపెయిన్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

సఖినేటిపల్లి: బడి మానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ బడిలో చేర్పిద్దాం అని అంటూ నేను బడికిపోతా కొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంఈవో–1, 2 డి.కిషోర్ కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం టేకిశెట్టిపాలెంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల స్టాఫ్ సహకారంతో క్యాంపెయిన్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు, బడిలో అంటూ, పిల్లలతో పాటు తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ప్రతి రోజూ పిల్లలను బడికి పంపేలా చూడాలని ఎంఈవోలు కోరారు. కాగా ఈ డ్రైవ్ వచ్చే నెల 12 వరకూ కొనసాగుతుందని వారు అన్నారు. సీఆర్పీలు కిషోర్, జానకి, పాఠశాల హెచ్ఎం విశ్వేశ్వరరావు, టీచర్లు ఇందిర, సుజాత, శ్యాంసన్ పాల్గొన్నారు.

బడి ఈడు చిన్నారులంతా బడిలోనే ఉండాలి

రావులపాలెం: బడి ఈడు చిన్నారులందరూ బడిలోనే ఉండాలని అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు పిలుపునిచ్చారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'నేను బడికిపోతా' ర్యాలీ ఎంఈవో పి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీసీ మధుసూదనరావు మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, సమాజంలో ప్రతి ఒక్కరూ అక్షరాస్యులైనప్పుడే సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. 6–14 సంవత్సరాల వయస్సు లోపు చిన్నారులందరూ బడిలోనే ఉండాలన్నారు. బడి బయట ఉన్న చిన్నారులను బడిలో చేర్చేందుకు ఉద్దేశించిన 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకుని, పాఠశాలల పరిధిలోని బడిఈడు చిన్నారులందరూ బడిలో ఉండే విధంగా తల్లిదండ్రులను చైతన్యవంతం చేయాలన్నారు.